క్లుప్తంగా

బీచ్‌లో వ్యర్థాల తొలగింపు



తీరంలో వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

బీచ్‌రోడ్డు: సాగరతీరంలో పేరుకుపోయిన వ్యర్థాలను ఆదివారం కేర్ ఆస్పత్రి సిబ్బంది తొలగించారు. సామాజిక బాధ్యతగా ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు ఉన్న వ్యర్థాలను తొలగించి జీవీఎంసీ సిబ్బందికి అప్పగించారు. అనంతరం పరిసరాల శుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

శాకంబరి అలంకరణలో చిన పోలమాంబ



అలంకరణలో చిన పోలమాంబ అమ్మవారు

మద్దిలపాలెం : శివాజీపాలెంలో చిన పోలమాంబ అమ్మవారు ఉత్సవాలలో భాగంగా ఆరో రోజు ఆదివారం శాకంబరి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం నుంచి భక్తులకు అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యూ లైను ఏర్పాటు చేశారు. శివాజీపాలెం, పీతలవానిపాలెం, తదితర ప్రాంతాలో విద్యుద్దీపాలతో అలంకరించారు. సాయంత్రం వేళ సాంస్కృతిక ప్రదర్శనలకు ఏర్పాటు చేశారు.

కమనీయం.. కల్యాణం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

బీసీ సంఘం గోల్డెన్ ఉత్సవాలకు ఆహ్వానం



మంత్రి బొత్సతో మాట్లాడుతున్న వేణుమాధవ్

బీచ్‌రోడ్డు: ఈ నెల మూడో వారంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం గోల్డెన్ ఉత్సవాలు విశాఖలో నిర్వహించనున్నారు. ఈమేరకు ఉత్సవాలకు రావాల్సిందిగా మంత్రి బొత్స సత్యనారాయణను ఆ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ ఆహ్వానించారు. ఆదివారం నగరానికి వచ్చిన ఆయనను సంఘం నాయకులు కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తూర్పు కాపు నాయకుడు పిన్నింటి గణేష్ తదితరుల పాల్గొన్నారు.



కైలాసగిరిపై హంగులతో కళకళలాడుతున్న శివపార్వతుల విగ్రహాలు



రాతి విగ్రహాల పార్కులో ఏర్పాటు చేసిన పూల మొక్కలు

కైలాసగిరి..అందాల ఝురి



కొత్తగా వేసిన ఘాట్‌రోడ్డు



కళకళలాడుతున్న కైలాసగిరి పార్కు

ఆరిలోవ: నగరంలో ప్రధాన పర్యాటక కేంద్రంగా నిలిచిన కై లాసగిరి కొత్తదనం సంతరించుకొంది. ఇటీవల జరిగిన జి–20 సదస్సులో భాగంగా వీఎంఆర్‌డీఏ అధికారులు దీని రూపురేఖలు మార్చారు. స్వదేశీ, విదేశీ అతిథులను ఆకట్టుకొనే విధంగా దీనికి మెరుగులు దిద్దారు. విశాలాక్షినగర్ కూడలి వద్ద ప్రారంభమైన ఘాట్ రోడ్డు నుంచి కొండపైన తెలుగు మ్యూజియం వరకు తారు రోడ్డు నిర్మించారు. దాని పక్కన గోడలకు రంగులు వేశారు. కొండపై ఉన్న శివ పార్వతుల విగ్రహాలకు కొత్తదనం తీసుకొచ్చారు. ఇంతవరకు తెల్లని రంగులో దర్శన మిచ్చిన శివపార్వతుల విగ్రహాలకు రంగులు వేశారు. శివుడి మెడలో రుద్రాక్షలకు ఎరుపు రంగు, చేతులు, చెవులు, కాళ్లకు బంగారు రంగు ఆభరణాలు అమర్చారు. పార్వతీదేవి విగ్రహానికి మెరుగులు దిద్దారు. ఇక్కడ వెళ్లే ఘాట్ రోడ్డు, కొండపైన ఆర్చి నుంచి తెలుగు మ్యూజియం వరకు ఉన్న రహదారులు మెరిసిపోయేలా తీర్చిదిద్దారు. ఈ రోడ్ల పక్కన రక్షణ గోడకు రంగులు వేశారు. కొండపై ఉన్న అన్ని పార్కులలో లేన్‌లు అమర్చడంతో పచ్చదనం కనువిందు చేస్తోంది. ఈ పార్కుల్లో సందర్శకులు సేదదీరుతున్నారు. పిల్లలు సరదాగా ఈ లేన్‌లపై ఆటలాడుకొంటున్నారు. వీటికి తోడు పార్కుల్లో పిల్లలు కోసం వివిధ రకాల ఆట పరికరాలు సిద్ధం చేశారు. ఇక్కడ శంఖుచక్రాలకు ఎదురుగా పలు రకాల ఆటపరికరాలు అమర్చారు. దీంతోపాటు ఇక్కడ శిథిలమైన రాతి విగ్రహాల పార్కుకు మెరుగులు దిద్దారు. ఊడిపోయిన పాత్‌వేలను తొలగించి మట్టితో దార్లు ఏర్పాటు చేసిన వాటి మధ్యలో వివిధ రకాల పువ్వుల మొక్కలు నాటించారు. దీంతో కైలాసగిరిపై కొత్తదనం సంతరించుకొందని సందర్శకులు అంటున్నారు.



శంకుచక్రాల ముందు అదనంగా ఏర్పాటు చేసిన పిల్లల ఆట పరికరాలు

వేసవి శిబిరాలతో వికాసం



చిత్రలేఖనంలో తర్ఫీదు పొందుతున్న చిన్నారులు



శిక్షణకు హాజరైన చిన్నారులు

మద్దిలపాలెం : పిఠాపురంకాలనీలో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్‌లో వేసవి శిక్షణా శిబిరాన్ని ఆసరా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు సునీత ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు విజ్ఞానం, వినోదం అందించేలా శిక్షణ శిబిరాలు దోహదపడుతున్నాయన్నారు. వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ వ్యవస్థాపరాలు డాక్టర్. రమాప్రభ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఈ వేసవి శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ఆసరా సహకారాన్ని అందిస్తోందన్నారు. సమ్మర్‌లో 15 రోజులు పాటు జరిగే ఈ వర్క్ షాప్‌లో భీమిలి, మధురవాడ, ఆరిలోవ, మద్దిలపాలెం ప్రాంతాల నుంచి 90 మంది హాజరయ్యారన్నారు. శిక్షణ అనంతరం 40 ప్రాంతాలలో వేసవి శిబిరాలను పిల్లలే నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు. మే 2వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ నిర్వహిస్తారన్నారు. అందుకు కావాల్సిన ఏర్పాట్లు వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ వలంటీర్లను ఏర్పాటు చేస్తోందన్నారు. ఐస్ బ్రేకింగ్ యాక్టివిటీ, సైంటిస్ట్ గేమ్, క్లాప్, వాక్, జంప్, నంబర్ గేమ్స్, మెమరీ గేమ్స్ నేర్పించడం జరుగుతోందన్నారు. ఫ్లవర్‌వాజ్‌లు, రాకెట్స్, ఫ్రేమింగ్ వంటి నేర్పించడంతోపాటు తయారు చేసేలా శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శైలజ, పూజిత, హరిత, నీలవేణి, కొండమ్మ, కుమారి, నాగమణి, రోహిణి పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ చాలీసా పారాయణం



హనుమాన్ చాలిసా పారాయణంలో పాల్గొన్న భక్తులు

మహారాణిపేట: హనుమాన్ చాలిసా పారాయణాన్ని ఆదివారం ఎంవీపీ కాలనీ భద్రం కమ్యూనిటీ హాలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు శ్రీ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక పారాయణం కార్యక్రమం మధ్యాహ్నం రెండు గంటల వరకు సాగింది. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణ, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

'మన్ కీ బాత్'లో బీజేపీ శ్రేణుల సందడి

ఎంవీపీకాలనీ: ప్రధాని నరేంద్రమోదీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మన్ కీ బాత్ 100వ ప్రసంగాన్ని బీజేపీ కార్యకర్తలు, నాయకులు విన్నారు. ఎంవీపీకాలనీ సెక్టార్–6 ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. ప్రధాని మోదీ 2014 నుంచి ప్రజలతో మమేకమవుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రత్యేకమైన విషయాలతో పాటు విభిన్న సంస్కృతులు, ప్రసిద్ధ కళలు, కళాకారులు, భౌగోళిక విశిష్టతలను ఆయన వివరిస్తున్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కె.సుహాసిని ఆనంద్, విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త మేడపాటి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

అనంతుని ఘాట్ రోడ్డు పరిశీలన

పద్మనాభం: పద్మనాభంలోని అనంతుని ఘాట్ రోడ్డుపై పులి జాడలు ఉన్నాయేమోనని అటవీ శాఖ అధికారులు ఆదివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతుని ఘాట్ రోడ్డుపై పులి సంచరిస్తుందని స్థానికులు శనివారం అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై పద్మనాభం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు అటవీ శాఖ అధికారులు అనంతుని కొండ ఘాట్ రోడ్డు, కొండ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఇక్కడ పులి జాడలు లేవని అటవీ శాఖ అధికారులు నిర్ధారించారు. దీంతో భక్తులు, అర్చకులు ఊపిరి పీల్చుకున్నారు.



ఘాట్ రోడ్డు పరిసరాలో పులి జాడలు ఉన్నాయేమోనని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

విద్యుత్ కార్మిక సంఘంలో పలువురి చేరిక

మహారాణిపేట : తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘంలో ఆదివారం ఉదయం డిస్కం అధ్యక్షుడు బీఎం నాయుడు, కార్యదర్శి బీవీ రవీంద్ర సమక్షంలో సీనియర్ బీఎంఎస్ యూనియన్ నాయకుడు టీవీ రమణమూర్తి, మరి కొంత మంది సభ్యులు చేరారు. ఈ సందర్భంగా బీఎం నాయుడు మాట్లాడుతూ సీనియర్ నాయకులు రమణమూర్తి రాకతో యునియన్‌కు బలం చేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోన రవికిషోర్, డిస్కం కార్యవర్గ సభ్యులు సుందరపు మహేష్, జిల్లా అధ్యక్షుడు వేదుల నగేష్, కార్యవర్గ సభ్యులు కె. నాయుడుబాబు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం మొండిగా వ్యవహరిస్తోంది



ఉక్కు పరిరక్షణ కమిటీ సభ్యులకు సంఘీభావం తెలుపుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అల్లిపురం: విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. పార్టీ కార్యాలయంలో ఆయనను విశాఖ ఉక్కు పరిరక్షణకు యూనియన్ సంఘాలు ఆదివారం కలిసాయి. ఈ సందర్భంగా ఆయన సంఘాల పోరాటానికి సంఘీభావం తెలిపారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటు పరం కాకుండా ఉండడానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలను ఆయన యూనియన్ నేతలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సమస్య పరిష్కారానికి అందరం కృషి చేద్దామని సూచించారు. పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కెఎస్ఎన్‌రావు, ఎన్. రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు

నూతన కార్యవర్గం

మహారాణిపేట : ఏపీ జేఏసీ (అమరావతి) విశాఖ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. పరిశీలకుడిగా ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ కృష్ణమూర్తి వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా సత్తి నాగేశ్వరరెడ్డి తిరిగి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాసరావు(ఆర్టీసీ), అసోసియేట్ చైర్మన్‌గా ఎస్.ఎ.త్రినాథరావు (రెవెన్యూ, డిప్యూటీ తహసీల్దార్), వైస్ చైర్మన్‌గా ఎ.శ్రీనివాసరావు (దివ్యాంగుల శాఖ), నమ్మి శ్రీనివాసరావు (నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం), సీహెచ్ రామకృష్ణమూర్తి (భాషా పండితుల సంఘం), వైస్ చైర్మన్ (ఉమెన్ వింగ్) డాక్టర్ పూర్ణిమ (వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సర్వీసెస్ అసోసియేషన్) కార్యదర్శి కె.సురేష్‌కుమార్(గ్రామవార్డు సచివాలయాలు), ఎ.శ్రీనివాసరావు (పీఆర్ ఇంజినీర్సు అసోసియేషన్), కార్యదర్శి ఎన్.మేఘ శ్యామ్ వెంకటేష్ యాదవ్ (ఏపీ స్టేట్ లేబర్ డిపార్టుమెంట్), కార్యదర్శిగా పీయూఎస్ మహేష్ (ఏపీ రెవెన్యూ అసోసియేషన్), కార్యదర్శి (ఉమెన్ వింగ్) ఆర్. అనూష (ఏపీ రూరల్ వాటర్ సప్లైస్ ఇంజినీర్సు), కోశాధికారిగా బి.రవిశంకర్ (డిప్యూటీ తహసీల్దార్) తదితరులు ఎన్నికయ్యారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి జన్మదినం



స్వర్ణ వస్త్రాలంకరణలో కన్యకాపరమేశ్వరి

డాబాగార్డెన్స్: కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారి జన్మదినం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ కల్యాణ మండప సంఘం, వాసవీ విజ్ఞానమండలి, ఆర్యవైశ్య సమాజం, ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్, వివిధ వాసవీ క్లబ్‌ల సంయుక్త సహకారంతో కార్యక్రమం అట్టహాసంగా జరిపారు. 146 సంవత్సరాల చరిత్ర గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో వేకువజాము 3 గంటలకు సుప్రభాతంతో మొదలై ప్రత్యేక క్షీరాభిషేకం, స్వర్ణ వస్త్రాలంకరణ, స్వర్ణపుష్పాలతో ప్రత్యేక పూజ నిర్వహించారు. 102 మంది మహిళలచే సామూహిక కుంకుమ పూజలు, వాసవీ కన్యకాపరమేశ్వరి జీవిత చరిత్ర కథా గానామృతం, వాసవీ మూలమంత్ర హోమం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. వాసవీమాతను హంసవాహనంపై ఊరేగించారు. శోభాయాత్ర కనులపండువగా సాగింది.

పూర్వ విద్యార్థుల కలయిక



ముడసర్లోవ పార్కులో ఏయూ హైస్కూల్ 1988 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

ఆరిలోవ: ఆంధ్రా యూనివర్సిటీ ఉన్నత పాఠశాలలో 1988 బ్యాచ్‌లో పదో తరగతి చదువుకొన్న పూర్వ విద్యార్థులు ఆదివారం ముడసర్లోవ పార్కులో కలిశారు. వారంతా ప్రస్తుతం దేశంలో వివిధ ప్రాంతాలలో స్థిరపడ్డారు. కొందరు వ్యాపారం, ఇంకొందరు ఉద్యోగం చేసుకొంటూ బిజీగా ఉంటున్నా రు. వారంతా విశాఖలో రోజంతా సరదాగా గడిపా రు. పాత జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకొని సందడి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆనాటి మధుర స్మృతులు ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. వాటిని మళ్లీ గుర్తు చేసుకోవడానికి అందరం ఒకేచోట కలిశామని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వై.శ్రీనివాసరావు, ఎన్.జోగారావు, ఆర్.నాగరాజు పట్నాయక్, ఎం.వి గంగాధర్, దల్లి శ్రీనివాస రెడ్డి, పి.చంద్రశేఖర్, బి.దేవుడు, వినోద్, ప్రజాద్, నరసింగరావు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఉన్నతికి విద్య దోహదం



ఆచార్య వెలమల సిమ్మన్నను సత్కరిస్తున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: విద్య వ్యక్తి ఉన్నతికి దోహదపడుతుందని ఆంధ్రవిశ్వవిద్యాలయం తెలుగు విభాగం విశ్రాంత ఆచార్యులు వెలమల సిమ్మన్న అన్నారు. ఆదివారం దూరవిద్య కేంద్రంలో దూరవిద్యలో ఎంఏ తెలుగు అభ్యసిస్తున్న విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్య వారసత్వంగా లభించే సంపద కాదని, ఎవరికి వారే సంపాదించుకోవాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంల జీవితాలు వీటిని ఉదాహరణలన్నారు. అతి సామాన్య కుటుంబంలో జన్మించినప్పటికీ తమ స్వశక్తితో వీరు జ్ఞానసముపార్జన చేసి దేశం గర్వించే స్థానాలను అధిరోహించారన్నారు. మనుషుల మధ్య దూరాన్ని చెరిపేసి, సమానత్వాన్ని సాధింపచేసేది విద్య మాత్రమేనన్నారు. వ్యక్తిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి విద్య ఉపకరిస్తుదంన్నారు. కార్యక్రమానికి తెలుగు ఆచార్యులు డా.బూసి వెంకటస్వామి అధ్యక్షత వహించారు. తమకు పాఠాలు బోధించిన గురువులను దూరవిద్యాకేంద్ర విద్యార్థులు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో తెలుగు చార్యులు డాక్టర్ పెండ్యాల లావణ్య, డాక్టర్ యల్.గిరీష్ కుమార్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీకాలనీ సెక్టార్–1 కొత్త వెంకోజిపాలెంలో షటిల్ పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. శ్రీగణేష్ సాయి షటిల్, బ్యాడ్మింటన్ అసోసియేషన్, ఆడారి అప్పారావు, సన్యాసమ్మ చారిటబుల్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో మొత్తం 12 టీమ్‌లు పాల్గొన్నాయి. ఉత్కంఠ భరితంగా జరిగిన ఈ పోటీలలో రెండు టీమ్‌లు విజేతలుగాను, రెండు టీమ్‌లు రన్నరప్‌గాను నిలిచాయి. అనంతరం విజేతలుగా నిలిచిన టీమ్ సభ్యులు జాన్ అప్పారావు, పల్లా పైడిరాజు, కోరిబిల్లి వెంకట్, కాళ్ల పోలినాయుడు, పీల కనకరాజు, పిల్లా ప్రతాప్‌రెడ్డి, వేగి రామకృష్ణ, వేగి తారకేష్‌లకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఆడారి ఈశ్వరరావు, ఆడారి శ్రీనివాస్, ఆడారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సత్కారం



సంస్థ ఉద్యోగులను సత్కరిస్తున్న దృశ్యం

ఎంవీపీకాలనీ: గోబడ్డి సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఎంవీపీ కాలనీలోని సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు నరసింగరావు, శివకుమార్, రాజ్‌గౌడ్‌లు మాట్లాడుతూ బానిసత్వం, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా శ్రమదోపిడిని నివారిస్తూ కార్మికులు హక్కులను సాధించుకోవడం జరిగిందన్నారు. దీనికి ప్రతీకగానే మేడేని ఏటా జరుపుకుంటున్నామన్నారు. గోబడ్డి సంస్థ ప్రత్యేక యాప్ ద్వారా ఏసీ మెకానిక్, ప్లంబర్, పెయింటర్, కార్పెంటర్, హౌస్ కీపింగ్ సేవలను కార్మికుల ద్వారా అందిస్తుందన్నారు. విశాఖ జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. గోబడ్డి యాప్ ద్వారా ఈ సేవలను పొందవచ్చన్నారు. కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని సంస్థలోని కార్మికులను సత్కరించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



డ్యాన్స్ చేస్తున్న కళాకారులు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన కూచిపూడి జానపద నృత్యాల ప్రదర్శన ఆద్యంతం ప్రేక్షకులను రంజింపజేసింది. హైదరాబాద్ టీఎస్ కళాసమితి కళాకారులు వినూత్న నృత్య రీతులతో ఆకట్టుకున్నారు. కళాకారులు తపస్విని, వర్షామృత, సోని, అనన్య, హిమసుధ, చిన్మయ, దివ్య, రేవతి, కళ్యాణిసాయి తదితర కళాకారులు పాల్గొనగా కల్యాణి భవ్య సాయి నృత్య దర్శకత్వం వహించారు. శాంతకుమారి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

ద్విచక్ర వాహనం బోల్తాపడి యువకుడి దుర్మరణం

తగరపువలస: రాజాపులోవ – రాయ్‌పూర్ జాతీయ రహదారిపై భీమిలి మండలం దాకమర్రి తాజుద్దీన్ బాబా ఆశ్రమం రహదారి వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నమ్మి రాంబాబు(23) అనే యువకుడు మృతి చెందాడు. విజయనగరం జిల్లా డెంకాడ మండలం మోదవలస పంచాయితీకి చెందిన రాంబాబు, లొడగల వెంకటేష్ ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తూ వాహనం జారి బోల్తా పడడంతో కింద పడ్డారు. ఈ ప్రమాదంలో రాంబాబు తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. ప్రమాద విషయం తెలుసుకున్న వారి బంధువు అలబోయిన రాజేష్ సంగివలస అనిల్ ఎన్ఆర్ఐ ఆస్పత్రికి క్షతగాత్రులను తరలించగా రాంబాబు ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి ఆరిలోవ అపోలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. మృతుని తండ్రి నారాయణఅప్పడు ఫిర్యాదు మేరకు భీమిలి ఎస్ఐ గంటా హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.